సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 7-12-2024

సంపుటి: 20 సంచిక: 216

పేజీలు: 4 వెల: రూ.1

## ఫ్లాష్.. ఫ్లాష్..!

### ఇండియన్ ఆర్మీ కాలింగ్ రమణ అరెస్టు
### జువైనల్ చట్టం ప్రయోగించిన పోలీసులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్మీలో ఉద్యోగంకోసం తన సంస్థలో చేరిన మైనర్ విద్యార్థిని రూమ్‌లో బంధించి యూఎస్‌బీ కేబుల్‌తో చిత్ర హింసలు పెట్టిన కేసులో ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బీవీ రమణను అరెస్టు చేసి శనివారం సాయంత్రం 3.30 గంటలకు డీఎస్పీ వివేకానంద మీడియా ముందు పెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ట్రోలైన వీడియో ఆధారంగా సీఐ పైడపు నాయుడు నేతృత్వంలో ఎస్ఐ హరికృష్ణ, బాధితుడ్ని విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత రమణను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ట్రోల్ అవుతున్న వీడియో 2023 డిసెంబరు 28 నాటిదని, ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికివెళ్లిన విద్యార్థుల్లో కొందరు దొంగతనం చేశారన్న ఫిర్యాదు రావడంతో బీవీ రమణ, వారిని గదిలో బంధించి చిత్రహింసలు పెట్టాడని తేలిందని, మైనర్ బాలుడిపై ఆ విధంగా హింసకు పాల్పడటంపై జువైనల్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. అమ్మాయిల బెడ్‌రూమ్‌లో సీసీ కెమెరాలు ఉన్నాయని కొన్ని పత్రికల్లో కథనాలు రావడంతో విచారణ జరిపామని, అయితే తమ వస్తువులు పోతున్నాయని తామే చెప్పడంతో మేనేజ్‌మెంట్ సీసీలు పెట్టాయని బాలికలు చెప్పడం వల్ల దీని మీద కేసు నమోదు కాలేదన్నారు. రమణకు సంబంధించిన మరో రెండు అంశాలపై మరింత లోతుగా విచారణ జరపాల్సి ఉందని డీఎస్పీ వివేకానంద పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.







# పాపం ఎవరిదైనా.. భారం మనదే!

- పాత ట్రూఅప్‌కు అదనంగా ఛార్జీలు
- నవంబరు నుంచి కరెంటు బిల్లులు పెంపు
- జిల్లాపై రూ.67 కోట్లు భారం
- సామాన్యుడికి అర్థంకాని సర్దు'పోటు'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఏడాది సెప్టెంబర్‌లో 154 యూనిట్లు వినియోగించిన కేటగిరి -1 వినియోగదారుడికి అక్టోబర్‌లో వచ్చిన విద్యుత్ బిల్లు రూ.730. ఇందులో సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ-2) పేరుతో రూ.61 అదనంగా వసూలు చేశారు. అదే వినియోగదారుడు అక్టోబర్‌లో 177 యూనిట్లు వినియోగిస్తే నవంబర్‌లో వచ్చిన బిల్లు రూ.910. ఇందులో ఎఫ్‌పీపీసీఏ-2 ఛార్జీలు రూ.70 అదనంగా జత చేశారు. నవంబర్‌లో 135 యూనిట్లు వినియోగిస్తే వచ్చిన బిల్లు రూ.725. ఇందులో ఎఫ్‌పీపీసీఏ-2 రూ.62, కాగా ఎఫ్‌పీపీసీఏ-1 ఛార్జీ రూ.108 అదనంగా జత చేశారు. ఎఫ్‌పీపీసీఏ-2లో యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తుండగా, ఈ నెల బిల్లులో ఎఫ్‌పీపీసీఏ-1 ఛార్జీల రూపంలో యూనిట్‌కు 80 పైసలు వసూలుచేశారు. ఒక వినియోగదారుడు నెలకు 100 యూనిట్లు విద్యుత్ వాడితే ఎఫ్‌పీపీసీఏ-2 ఛార్జీల కింద రూ.40, ఎఫ్‌పీపీసీఏ-1 కింద రూ.80 అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. 2023-24లో అధిక ధరలకు కొనుగోలు చేసిన ఇంధనానికి, ఇప్పుడు ట్రూ అప్ ఛార్జీల విధింపును ఏపీఈఆర్సీ అనుమతించింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు కొనుగోలు చేసిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు విధించాలని డిస్కంలు ప్రతిపాదనను ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఈ నెల నుంచి ప్రతి 100యూనిట్లకు రూ.80 అదనపు భారం పడనుంది.

### మాట తప్పిన ప్రభుత్వం

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని, వీలైతే తగ్గించేందుకు - మిగతా 4లో



# ధర్మమే వారికి చట్టం

ఒక వ్యక్తి ఎంత శక్తిమంతుడైనా, ప్రముఖుడైనా మతసూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎవర్నయినా వారు శిక్షిస్తారు. ఆ వ్యక్తిపై అకల్ తఖ్త్‌కు ఫిర్యాదు చేస్తే అమృత్‌సర్‌లోని అకల్ తఖ్త్ సెక్రటేరియట్‌లో అకల్ తఖ్త్ జతేదార్ నేతృత్వంలో అయిదు తఖ్త్‌లకు చెందిన ప్రతినిధులు సమావేశమై సదరు వ్యక్తిపై విచారణ జరిపి శిక్షను నిర్ధారిస్తారు. సిక్కులకు సంబంధించి మతపరమైన కట్టుబాట్లు దాటితే దేశ ప్రథమ పౌరుడ్ని కూడా క్షమించమన్న సంకేతాలు గతంలోనే ఇచ్చారు. ఒకప్పటి హోం మంత్రి బూటాసింగ్, అప్పటి రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్‌లను కూడా అకల్ తఖ్త్ విడిచిపెట్టలేదు. తాజాగా పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు ఇటువంటి శిక్షే విధించడంతో మళ్లీ సిక్కుల మత అంశాలు తెర మీదకు వచ్చాయి.



## బూటాసింగ్, జ్ఞాని జైల్‌సింగ్‌లకు కూడా శిక్షలు వేసిన అకల్ తఖ్త్

- సత్యం ఐటీ డెస్క్

పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ నాయకుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు అకల్ తఖ్త్ సోమవారం మతపరమైన శిక్ష విధించింది. సిక్కు నియమాలను ఉల్లఘించినా, సిద్ధాంతాలకు వ్యతిరేకమైన పనులు చేసినా సదరు వ్యక్తికి మతపరమైన శిక్ష విధించే అధికారం అకల్ తఖ్త్‌కు ఉంటుంది. ఇలాంటి శిక్షలను 'తన్ఖా' అని పిలుస్తారు. సుఖ్‌బీర్ బాదల్‌తో పాటు 2007-17 మధ్య శిరోమణి అకాలీదళ్ కేబినెట్‌లో సభ్యులుగా ఉన్న చాలామందికి అకల్ తఖ్త్ మతపరమైన శిక్ష విధించింది. ఇంతకీ అకాలీదళ్ నాయకుల్ని ఎందుకు శిక్షించారు?

పంజాబ్‌లో 2007 నుంచి 2017 వరకు శిరోమణి అకాలీదళ్-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో అకాలీదళ్ నాయకుడు ప్రకాశ్ సింగ్ బాదల్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ డిప్యూటీ ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రకాశ్‌సింగ్ బాదల్ 5సార్లు పంజాబ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. సిక్కు సిద్ధాంతాలకు, సిక్కు సమాజం మనోభావాలకు విరుద్ధంగా అకాలీదళ్ నాయకత్వం వ్యవహరిస్తోందని ఆరోపణలు వచ్చాయి. 2015లో పంజాబ్‌లోని బర్గారిలో సిక్కుల పవిత్ర గ్రంథం 'గురు గ్రంథ్ సాహిబ్'లోని కొన్ని పేజీలను దుండగులు చింపేశారు. గురు గ్రంథ్ సాహిబ్ సిక్కులకు అత్యంత పవిత్రమైనది. ఈ ఘటనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో, పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు సిక్కులు మరణించారు. ఈ కేసులో దేరా సచ్చా సౌదా చీఫ్ రామ్ రహీమ్ (డేరాబాబా) అనుచరులు నిందితులని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన కేసులో రామ్ రహీమ్‌పై సుప్రీంకోర్టులో ఈ ఏడాది అక్టోబరులో మళ్లీ విచారణ ప్రారంభమైంది. 2007లో రామ్‌రహీమ్‌ను బహిష్కరించాలని అకల్ తఖ్త్ ఆదేశించింది. గుర్మీత్ రామ్ రహీమ్‌ను బహిష్కరించిన తర్వాత కూడా ఆయనతో అకాలీదళ్ నాయకులు సంబంధాలు కొనసాగించారనే ఆరోపణల నేపథ్యంలో సోమవారం అకల్ తఖ్త్ సుఖ్‌బీర్‌కు మతపరమైన శిక్ష వేసింది. పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు ఇటీవలే బాదల్ ప్రకటించారు.

### అకాలీదళ్ నాయకులకు విధించిన శిక్ష ఏంటి?

**శిరోమణి అకాలీదళ్ ప్రభుత్వం రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు, మతపరమైన తప్పిదాలు చేసినట్లు అకల్ తఖ్త్ నిర్ధారించింది. శిక్షలో భాగంగా మధ్యాహ్నం 12-1 గంటల మధ్య స్వర్ణ దేవాలయ కాంప్లెక్స్‌లోని టాయిలెట్‌లను శుభ్రం చేస్తారు. తర్వాత స్నానం చేసి వంట పాత్రలు కడుగుతారు. గుర్బానీ (సిక్కు కీర్తనలు) వింటారు. మెడలో ప్లకార్డు కూడా వేసుకోవాలి.**

సుఖ్‌బీర్ బాదల్ కాలికి గాయం, సీనియర్ నాయకుడు సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా వారిద్దరినీ దర్బార్ సాహిబ్ గేటు వద్ద వీల్‌చెయిర్‌పై కూర్చుని కాపలాదారుగా పని చేయాలని ఆదేశించారు. రోజుకు రెండు గంటల చొప్పున యూనిఫారం ధరించి, చేతిలో ఈటె పట్టుకుని అక్కడ పని చేయాలని శిక్ష విధించింది. పంజాబ్‌లోని మరో రెండు తఖ్త్‌లతో పాటు, ఫతేఘర్ సాహిబ్ గురుద్వారాలో కూడా రెండు రోజుల పాటు సేవలందించారు.

### గతంలో మత శిక్ష అనుభవించిన నాయకులు

1984 ఆపరేషన్ బ్లూస్టార్‌లో అకల్ తఖ్త్ భవనం దెబ్బతింది. భారత ప్రభుత్వం తర్వాత మరమ్మతు చేసింది. అప్పుడు కేంద్ర హోం మంత్రి బూటా సింగ్, బుధ దళ్‌కు చెందిన శాంతా సింగ్ భారత ప్రభుత్వం తరఫున ఈ మరమ్మతు బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ సహాయంతో నిర్మించిన ఈ భవనాన్ని సిక్కులు ఆమోదించలేదు. 1986లో సర్బత్ ఖల్సా (సిక్కుల సమావేశాలు)లో ఈ భవనాన్ని కూల్చివేయాలని నిర్ణయించారు.

శాంతా సింగ్‌ను సిక్కు సంఘం నుంచి బహిష్కరించారు. ఆయనను 'తంఖాహియా' (అపరాధి)గా ప్రకటించారు. తన తప్పును అంగీకరించి అకల్ తఖ్త్ వద్ద హాజరయ్యారు. మతపరమైన శిక్షను ఆయనకు విధించారు.

అకల్ తఖ్త్ సాహిబ్‌పై దాడి జరిగిన సమయంలో బూటా సింగ్ కేంద్ర హోం మంత్రిగా, జ్ఞాని జైల్‌సింగ్ రాష్ట్రపతిగా ఉన్నారు. క్షమాపణ కోసం వీరిద్దరూ అకల్ తఖ్త్ సాహిబ్ వద్ద హాజరయ్యారు.

2017 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, ప్రకాశ్ సింగ్ బాదల్ స్వయంగా శిరోమణి అకాలీదళ్ నాయకులందరితో కలిసి 2018లో అకల్ తఖ్త్ వద్ద హాజరయ్యారు. స్వర్ణ మందిరంలో బూట్లు, పాత్రలను శుభ్రం చేశారు. అలాగే తమ హయాంలో జరిగిన 'తప్పులను' మన్నించాలని కోరారు.


డేరాబాబా







• ఎడిటోరియల్

# మిత్రుడిగా చేరి.. శత్రువుగా మారి

మనకు జబ్బు చేస్తే డాక్టరు దగ్గరకెళ్తాం. మందులు వాడతాం. మొన్న కరోనా వైరస్ విజృంభించి దాడి చేస్తే ప్రపంచమంతా వణికిపోయి, ఎన్ని జాగ్రత్తలు తీసుకొంది.. ఆఖరుకు వ్యాక్సిను కనుగొని నివారించుకున్నాం. లెక్కలేనన్ని బాక్టీరియాలు, వైరస్‌లు నిత్యం మనపై దాడి చేయటం, వాటిని తరిమి ఆరోగ్యాన్ని రక్షించుకోవడం ఒక జీవన పోరాటం. ఇవన్నీ కూడా మనకు తెలిసి, కనపడుతున్న శత్రు దాడులు. అందుకే అరికట్టే ఆయుధాలను సమకూర్చుకుంటాము. కానీ కనపడకుండా మన మనసుపై, శరీరంపై దాడి చేస్తూ భవిష్యత్తునంతా ఛిద్రం చేస్తున్న వైరస్సు మన ఆహ్వానం మేరకే వచ్చి తన ప్రతాపాన్ని చూపెడుతున్నది. అదే సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా). ఇది వైరస్ కన్నా ప్రమాదకరమైనదే. కొన్ని తరాలనే నిర్వీర్యులను చేస్తున్నది. నిస్సత్తువకూ, మానసిక దౌర్బల్యానికి గురిచేస్తున్నది. మిత్రునిలా దరిచేరి, శత్రువులా కబళిస్తున్నది. అది గమనించిన ఆస్ట్రేలియా సర్కారు, ప్రపంచంలోనే మొట్టమొదటిగా మేల్కొన్నది. వారి పార్లమెంటు ఒక మంచి నిర్ణయం తీసుకుంది. శారీరక, మానసిక ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని పదహారు ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలను నిషేధిస్తూ ఒక బిల్లును ఆమోదించింది. ఇదొక సాహసోపేతమైన చర్యనే. పిల్లల వయసుకు సంబంధించి సోషల్ మీడియా వేదికలు హేతుబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం సూచించింది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, రెడిట్ మొదలైన అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఈ నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. అయితే ఈ నిషేధిత జాబితాలో యూట్యూబ్‌ను మినహాయించింది. వయసు నిబంధన కఠినంగా అమలుపరచాలనీ, సోషల్ మీడియాలో పిల్లలు ఖాతాలు ఆరంభించకుండా నిరోధించకపోతే, సంబంధిత వేదికలకు రూ.280 కోట్లు జరిమానాగా విధించుతారని చట్టం పేర్కొంది. ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనేసే మాట్లాడుతూ, విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న కారణంగా పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం చాలా ప్రభావితమవుతోందని, అందువల్లనే ఈ నిషేధ చట్టం తెచ్చామని తెలపడం, మనమంతా కూడా ఆలోచించాల్సిన విషయం. చేతిలోకి సెల్‌ఫోన్లు వచ్చాక వివిధ సోషల్ మీడియా వేదికలు అనేకానేక చర్చలకు, అవాస్తవ, అశాస్త్రీయ, భ్రమాత్మక విషయాలకు వేదికగా మారిపోయాయి. ముఖ్యంగా యువత, పిల్లలు వాటికి అలవాటుపడిపోయి, ఇంకే విషయాలనూ, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పనులను, సమస్యలనూ పట్టించుకోకుండా పోయింది. మొత్తం 24 గంటల్లో అనేక గంటలు ముఖాన్ని కదలకుండా స్క్రీన్‌పై పెట్టడం, వేళ్లతో చాటింగ్‌లూ చేయటంలోనే మునిగిపోవటంవల్ల, శారీరకమైన రుగ్మతలు తలెత్తుతున్నాయి. అవసరమైన, ఎందుకూ పనికిరాని చెత్తంతా మెదళ్లపై చేరుతున్నది. ఇప్పటికే పిల్లలు ఘోరమైన గేమ్స్ వీడియోలు చూడటంవల్ల, వారి మానసిక పరిస్థితి హింసాత్మకంగా స్పందనా రహితంగా మారుతోందని మానసిక వైద్యులు వెల్లడిస్తున్నారు. చూపు మందగిస్తోంది. శారీరక కదలికలు, ఆటలు కరువై ఎదుగుదల కూడా ఆగిపోతున్నది. అంతేకాక సోషల్ మీడియాలో వచ్చే విషయాలు, సమాచారమే వాస్తవమైనదని భావించి అనేక అపోహలకు గురవుతున్నారు. ఇది భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇక మాదకం అలవాటయిన తర్వాత చూడకుండా ఉండలేనితనం పెరిగింది. అందుకనే పిల్లలు సెల్‌ఫోన్ల కోసం, యాప్‌ల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. మానసిక రోగులుగా మారిపోతున్నారు. ఒంటరులవుతున్నారు. దొంగతనాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారు. పిల్లలను చైతన్యరహితులుగానూ, నిస్తేజులుగానూ తయారుచేయటమే కాకుండా, మానసిక అనారోగ్యానికి గురిచేస్తున్న, శారీరక ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తున్న ఈ సోషల్ మీడియాను 16 ఏళ్లలోపు పిల్లలకు దూరంగా ఉంచడం చాలా అవసరమైన చర్య. ఇది చాలా చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ భవిష్యత్ తరాలకు, వారి క్షేమానికి సంబంధించినది. ఆస్ట్రేలియా దేశం చేసినట్లుగానే మన దేశమూ చేయాలి. తల్లిదండ్రులు ఈ విషయమై ఆలోచించి ప్రభుత్వాల ముందుకు నిషేధ డిమాండును తీసుకురావాల్సి ఉంది. ప్రభుత్వాలూ భావితరాల బాగుకోసం బాధ్యతగా ఆలోచన చేయాలి. 140 కోట్లు ఉన్న మన జనాభాలో స్మార్ట్ ఫోన్ లేని ఇల్లు లేదు. అందులోనూ ఈ జనరేషన్ పిల్లల చేతిలో సోషల్ మీడియా పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఆస్ట్రేలియా మాదిరిగా ప్రభుత్వమే ఒక నిర్ణయం తీసుకో వాలి తప్పితే తల్లిదండ్రులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

# ప్రభుత్వ విద్య బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని శ్రీకాకుళం బాలికల, బాలుర హైస్కూల్లో, గార, సింగుపురం జడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి వైపు ఒక అడుగు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలయిక అనే కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఇది ఒక బృహత్తరమైన కార్యక్రమం అని, ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రజలను భాగస్వామ్యం చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనలకనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భాగ్యస్వామ్యం కావడంతో సమాజాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నిగూఢమైన ప్రతిభను వెలికి తీసి సృజనాత్మకతను జోడించి విద్యార్థిలను ఉన్నతంగా తీర్చిదియడమే లక్ష్యమన్నారు. సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను రూపుమాపడానికి విద్య తోడ్పడుతుందని చెప్పారు. విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ వారిని ప్రోత్సహిస్తే మరిన్ని ఫలితాలు రాబట్ట వచ్చిందని చెప్పారు. పండగ వాతావరణం లో నిర్వహిస్తున్న ఈ సమావేశాలు ప్రభుత్వ పాఠశాల విద్య బలోపేతానికి, బడి బయట విద్యార్థుల సంఖ్య తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు పోటీలు ముగ్గులపోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాలొన్నారు.

స్థానిక చంపాగల్లివీధిలో గల ఎంసీఈ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు కె.చిన్నమ్మడు ఆధ్వర్యంలో శనివారం ల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎస్.కె. రహీమా, కె.సత్యనారాయణ, గూనపాలెం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.





నగరానికి చెందిన నల్లా గౌతమీ కుమార్తె సాయిఅక్షర, సాయి కీర్తన్‌ల జన్మదినం సందర్భంగా శనివారం స్థానిక తురాయి చెట్టు వీధికి చెందిన అల్లిపిల్లి సత్యవతి అనే బాలిక కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. సత్యవతి కొన్ని అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమయ్యారు. వీరి పరిస్థితి గమనించిన గౌతమి, ఆమె కుమార్తె, కుమారుడు ఈ సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, ఉర్లాం. శివతేజ, బొట్టా సాయి, పొడుగు చరణ్, సూరాడ పద్మ, కైలాష్, బాధిత కుటుంబసభ్యులు, శాంత అనురాగ నిలయ సాయి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

## బాలనాగమ్మ సేవలు చిరస్మరణీయం

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

ఆదివాసి హక్కుల కోసం మొగిలిపాటి బాలనాగమ్మ అనేక పోరాటాలు చేశారని సీపీఎం జిల్లా నాయకులు పోలాకి ప్రసాద రావు కె.సూరయ్య, సి.హెచ్.అమ్మన్నాయుడు అన్నారు. శనివారం ఆమె స్వగ్రామం మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామంలో సంతాపసభ నిర్వహించారు. గిరిజన పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని బాలనాగమ్మ పోరాడారన్నారు.



తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం స్థానిక పెద్దపాడు గురుకుల పాఠశాలలో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై రేణుక పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రంగమణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## పేరుమార్పు తప్ప అభివృద్ధి మాటే లేదు

(సత్యంన్యూస్, పాతపట్నం)



ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చడం తప్ప రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి మాత్రం ఏమీలేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే మాటను వైకాపా ప్రభుత్వం నిజం చేసిందన్నారు. ఉన్న గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకల సేవలు అందించి సేద్యం సజావుగా సాగేందుకు ఏటా మూడు విడతలలో రైతు భరోసాతో తోడ్పడిందన్నారు. రైతులకు అవసరమయిన ఎరువులు, పురుగుమందులు, నాణ్యమయిన విత్తనాలను ఇంటి వద్దకే అందచేసింది వైకాపా ప్రభుత్వమేనన్నారు. ఈ చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో కల్తీ ఎరువులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు ఋణమాఫీ చేస్తానని బూటకపు మాటలు చెప్పి అదికారంలోకి వచ్చిన తర్వాత రైతులను అన్ని విధాలుగా గుండె కోత కోశారన్నారు. తనకు తాను విజనరీ అని చెప్పుకొనే చంద్రబాబుకు అన్నం పెట్టె రైతులంటే ఎప్పుడు చులకనేనని విమర్శించారు.

### విద్యార్థులు భావిభారత

## అభివృద్ధిలో భాగం కావాలి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వీక్షిత్ భారత్ పోటీల్లో చురుకుగా పాల్గొని, భావిభారత అభివృద్ధిలో భాగం కావాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆచార్య బాలాజీ అన్నారు. ప్రధాని మంత్రి పిలుపు మేరకు నిర్వహించిన వీక్షిత్ భారత్ కార్యక్రమంలో మాట్లాడుతూ మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని కోరారు. డీన్ మోహన్‌కృష్ణ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, సమాజ బాధ్యత, సమాజ శ్రేయస్సు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామకృష్ణ ముని, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ జి.ఈశ్వర్ రావు, అధ్యాపకులు డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు, నెహ్రూ యువ కేంద్రం యూత్ వాలంటీర్ రౌతు సుమతి మోహన్ రావు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మరుపురాని మహానటి

- డిసెంబర్ 6న సావిత్రి జయంతి సందర్భంగా

నిశ్శంకర సావిత్రి గారు గుంటూరు జిల్లా చిర్రావూరు గ్రామంలో సామాన్య కాపు కుటుంబంలో జన్మించిన సావిత్రి చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్నారు. పెదనాన్న కొమ్మారెడ్డి వెంకట్రామయ్య ఆమెను పెంచి పెద్దచేశాడు. చిన్నప్పటి నుంచి కళలవైపు ఆసక్తితో పెరిగిన సావిత్రి తర్వాత నాటక రంగం లోకి ప్రవేశించింది. అప్పుడే హిందీ నటుడు పృథ్వీ రాజ్ కపూర్ చేతుల మీదుగా బహుమానం కూడా అందుకుంది. తర్వాత సినిమాల్లో నటించడం కోసం మద్రాసు చేరింది. చిన్న పాత్రలతో తన ప్రస్థానం మొదలు పెట్టి అగ్ర కథానాయికగా ఎదిగింది. తెలుగులోనే కాక తమిళంలో తనదైన ముద్ర వేసి నడిగర్ తిలగం అనే బిరుదు పొందింది. తమిళ నటుడు జెమిని గణేశన్ ను పెళ్ళి చేసుకుంది. అప్పటికే ఆయనకు ఇద్దరు భార్యలున్నారు. సావిత్రికి విజయ చాముండేశ్వరి అనే కూతురు, సతీష్ కుమార్ అనే కొడుకు జన్మించారు. కుటుంబ కలహాలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో ఒక దశలో బాగా బతికిన ఆమె చివరి దశలో పేద జీవితాన్ని గడి పింది. అనారోగ్యంతో ఒక సంవత్సరం కోమాలో ఉండి 46 సంవత్సరాల వయసులో మరణించారు.

తెలుగు, తమిళ సినిమా నటి, దర్శకురాలు. అభిమానులచేత మహానటిగా కీర్తింపబడిన అలనాటి అపురూప నటి, మూడు దశాబ్దాల కాలంలో అత్యధిక పారితోషికం పాటు అసాధారణ ప్రజాధరణ పొందిన నటీమణి సావిత్రి గారి జన్మదిన జ్ఞాపకం !

### తొలి జీవితం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో డిసెంబరు 6, 1936న నిశ్శంకర గురవయ్య, సుభద్రమ్మ దంపతులకు జన్మించింది. వారికి సావిత్రి రెండవ సంతానం, 1934లో ఆడపిల్ల పుట్టగా మారుతి అని నామకరణం చేశారు. సావిత్రికి ఆరు నెలలు నిండగానే టైఫాయిడ్ కారణంగా తండ్రి మరణించాడు. గురవయ్య మరణంతో సుభద్రమ్మ విజయవాడలోని తన అక్క అయిన దుర్గాంబ ఇంటికి మకాం మార్చింది. దుర్గాంబ భర్త పేరు కొమ్మారెడ్డి వెంకట్రామయ్య, సావిత్రికి వరుసకు పెద్దనాన్న. మారుతి, సావిత్రి విజయవాడలోని కస్తూరిబాయి మెమోరియల్ పాఠశాలలో చేరారు. పాఠశాలకు వెళ్ళే దారిలో నృత్య విద్యాలయం ఉండేది. రోజూ ఇతరులు నాట్యం చేయటం చూసి ఆ నృత్యనిలయంలో చేరి శిష్టా పూర్ణయ్య శాస్త్రిగారి దగ్గర సంగీతం మరియూ శాస్త్రీయ నృత్యం నేర్చుకొని విజయవాడలో తన చిన్నతనంలోనే ప్రదర్శనలు ఇచ్చింది. కొంతకాలం ఎన్టీఆర్, జగ్గయ్య తదితరులు నడుపుతున్న నాటకాల కంపెనీలో పనిచేసి, అనంతరం స్వయంగా పెదనాన్న నడిపిన నాట్య మండలిలో కూడా నటించింది. బుచ్చిబాబు రాసిన ఆత్మవంచన అనే నాటకంలో కూడా నటించింది.

### మూడు దశాబ్దాల సినీ జీవితం కాలంలో....

మూడు దశాబ్దాల కాలంలో సావిత్రి 250 కన్నా ఎక్కువ సినిమాలలో నటించారు. 1950, 60, 70,లలో ఎక్కువ పారితోషికం, ఎక్కువ ప్రజాధరణ పొందిన నటీమణులలో సావిత్రి ఒకరు . ఒకసారి సావిత్రి అవకాశం కోసం ప్రయత్నించినప్పుడు ఒక సినిమాలో ఒక పాత్ర కోసం మాత్రమే అవకాశం లభించింది కానీ డైలాగులు చెప్పేటప్పుడు సిగ్గుపడేవారు. హీరోలను చూసి విస్మయపోయేవారు. అదే సమయంలో తమిళ నటుడు జెమినీ గణేశన్ సావిత్రి ఫోటోలను తీసుకొని రెండు నెలల తర్వాత రమ్మని చెప్పి పంపాడు.. చేసేదేం లేక సావిత్రి తిరిగి తన గ్రామానికి వెళ్లి నాటకాలలో నటించడం ప్రారంభించారు. ఒకరోజు సావిత్రి ఇంటికి ఒక వ్యక్తి సినిమా అవకాశం తీసుకుని వచ్చాడు. అలా అలా సావిత్రి సినిమా జీవితం ప్రారంభమైంది. రూపవతి, పాతాళ భైరవి సినిమాలలో చిన్నచిన్న పాత్రలను చేశారు. తరువాత సావిత్రి నటించిన పెళ్లి చేసి చూడు సినిమా కూడా విజయవంతం అయింది. తరువాత దేవదాసు మిస్సమ్మలాంటి బ్లాక్‌బస్టర్ సినిమాలలో నటించారు . దర్శకుడు పి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సావిత్రి అందం- టాలెంట్ ముందు ఎవరు పోటీ చేయలే రు అన్నారు. సావిత్రి ఇతరుల సలహాలను వినేది కాదు. చాలా త్వరగా వివాహం చేసుకుంది. సావిత్రి బాలీవుడ్ సినిమాలలో నటించినా పెద్దగా సక్సెస్ కాలేదు 1973లో చూజీ అనే ఒకే ఒక్క మలయాళ సినిమాలో నటించారు 1957లో వచ్చిన మాయాబజార్ సినిమాలో ఆమె అభినయం సావిత్రిని ఆకాశానికి ఎత్తేసింది తరువాత సౌత్ ఇండియన్ సినిమాలలో ఎక్కువగా పారితోషికం తీసుకున్న నటిగా నిలిచారు. సావిత్రి తన దానగుణంలో ప్రసిద్ధి చెందారు ఆస్తి మరియు నగలు కొనడానికి ఇష్టపడేవారు. సావిత్రి తన ఖర్చుపై నియంత్రణ ఎక్కువగా చేయలేకపోయేవారు 1960లో చివరికి మిగిలేది సినిమాకు గాను రాష్ట్రపతి అవార్డు లభించింది చిన్నారి పాపలు అనే సినిమాకు నిర్మాతగా ఉన్నారు ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు ఫలితంగా భారీ నష్టాలను చూడవలసి వచ్చింది సావిత్రి మద్యానికి కూడా బానిసయ్యారు సావిత్రి జెమినీ గణేశన్‌ను పెళ్లి చేసుకున్నారు. జెమినీ గణేశన్ కుటుంబం వారు ఈ పెళ్లికి వ్యతిరేకత తెలిపారు ఎందుకంటే అంతకుముందే జెమిని గణేషన్‌కు పెళ్లి అయి నలుగురు కూతుళ్లు కూడా ఉన్నారు అదే సమయంలో పుష్పవల్లి అనే నటితో రిలేషన్ లో ఉన్నారు ఇవన్నీ లెక్క చేయకుండా సావిత్రి పెళ్లి చేసుకుంది క్రమంగా ఆర్థికంగా సావిత్రి చాలా నష్టపోయారు తన ఆర్థిక పరిస్థితిని చూసిన దాసరి నారాయణరావు తను నిర్మించిన సినిమాలలో సావిత్రి కి అవకాశాలను ఇచ్చారు పెదనాన్న ప్రోద్బలంతో సినిమా రంగం వైపు దృష్టి సారించి ఎన్నో కష్టాలనోర్చి తిరుగులేని అభినేత్రిగా విరాజిల్లింది. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన సంసారం సినిమాలో చిన్న పాత్ర పొంది, ఆనక ఆ పాత్రకు తగ్గ వయసు లేదని అందులోనుండి తొలగింపబడింది. ఆ తరువాత కె.వి.రెడ్డి దర్శకత్వం వహించిన పాతాళ భైరవిలో ఒక చిన్న పాత్రలో నటించింది. పెళ్ళిచేసిచూడు ఆమె సినీ జీవితంలో ఒక మలుపు. కాని అందులో ఆమె రెండో కథానాయిక పాత్రకే పరిమితం కావలసి వచ్చింది. తన నటనా ప్రతిభను నిరూపించు కోవటానికి ఆమె నృత్యరూపకుడు మరియూ దర్శకుడూ అయిన వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించిన దేవదాసు సినిమా వరకూ ఆగవలసి వచింది. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో మిస్సమ్మలో ప్రధానపాత్ర పోషించింది. ఆ చిత్రంతో ఆమె తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా స్థిరపడింది. ఆ తరువాత వచ్చిన దొంగరాముడు, అర్ధాంగి, చరణదాసి ఆమె స్థానాన్ని పదిల పరచాయి. 1957 లో వచ్చిన తెలుగు చిత్ర చరిత్రలోనే అజరామరం అనదగిన మాయా బజార్ చిత్రంలో ఆమె ప్రదర్శించిన అసమాన నటనా వైదుష్యం ఆమె కీర్తి పతాకంలో ఒక మణిమకుటం. అది మొదలు ఎన్నో వైవిధ్యమైన పాత్రలను తనకే సాధ్యమైన రీతిలో పోషించి వాటికి ప్రాణ ప్రతిష్ఠ చేసింది.

సావిత్రి గారు తమిళ చిత్రాలలోనూ నటించి పేరుతెచ్చుకుంది. తమిళంలోనూ మహానటి (నడిగర్ తిలగం) బిరుదు పొందింది. 1968లో చిన్నారి పాపలు సినిమాకు దర్శకత్వం వహించింది. ఈ సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. బహుశా దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా దాదాపు పూర్తిగా మహిళలచే నిర్మింపబడిన చిత్రంగా ప్రత్యేకత సంతరించుకున్నది. అయితే అది అంత విజయం సాధించలేదు. ఆ తరువాత చిరంజీవి, మాతృదేవత, వింత సంసారం మొదలగు సినిమాలకు దర్శకత్వం వహించింది. 1956లో అప్పటికే రెండు పెళ్ళిళ్ళయిన తమిళ నటుడు జెమినీ గణేశన్ను పెళ్ళిచేసుకుంది. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు - విజయ చాముండేశ్వరి, సతీష్ కుమార్. అయితే ఆ పెళ్ళి విఫలమైంది. ఆస్తిపాస్తులు కోల్పోయి, తాగుడుకు, మత్తుమందులకు, నిద్రమాత్రలకు బానిసై 1981 డిసెంబర్ 26న మరణించారు.

### చలనచిత్ర ప్రవేశానికి ముందు..

**సావిత్రి 13 సంవత్సరాల వయసులో ఉన్నసమయంలో కాకినాడలోని ఆంధ్రనాటక పరిషత్ నిర్వహించిన నృత్యనాటక పోటీలలో ఆనాటి హిందీ నటుడు, దర్శకుడు, హిందీ సినీరంగంలో ప్రసిద్ధుడు అయిన పృథ్వీరాజకపూర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నది. అది ఆమెలో కళలపట్ల ఆరాధన పెరగడానికి కారణమైంది. ఆమె 1949లో చలనచిత్రాలలో నటించడానికి మద్రాసు నగరం చేరింది. అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన అద్భుతం- సావిత్రి కనుసైగతో కోటి కలలు పండించగల మహానటీమణి. సినీ జీవితంలో ఆవిడ ప్రయాణం మరిచిపోలేని ఓ మధుర జ్ఞాపకం. ఇప్పటికీ ఎప్పటికీ తెలుగు సినీ ప్రపంచానికి ఒకే ఒక మహానటి నిశ్శంకర సావిత్రి. దక్షిణాది భాషలలో వెండితెరపై వెన్నెలను కురిపించి, అభినయంలో తనకు సాటి మరొక్కరు లేదని నిరూపించిన ఒకే ఒక్క మహానటి సావిత్రి. 1949లో అవకాశం వచ్చినా, ఆమె చిన్నపిల్లని ఆ పాత్రకు సరిపోదని ఆమెను ఎంపిక చేయకపోయినా, ఆ తర్వాత ఆమెను వెతుక్కుంటూ అవకాశం వచ్చింది.**

### అపజయాలు

**మహానటి సావిత్రి జీవితంలో సంభవించిన వరుస అపజయాలు ఆమెను ఆర్థికంగానూ మానసికంగానూ బాధించాయి. ఆమె దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చిన్నారి పాపలు. ఈ చిత్ర నిర్మాణంలో చాలా మంది పాలు పంచుకున్నారు. వీరి అభిప్రాయ బేధాలతో సినిమా సరిగా ముందుకు సాగకపోవడంతో ఆమె సొంత ఆస్తులు అమ్మి ఈ సినిమా నిర్మాణానికి వెచ్చించవలసి వచ్చింది. తెలుగులో అమోఘ విజయం సాధించిన మూగ మనసులు చిత్రాన్ని తమిళంలో నిర్మించి అందులో శివాజీ గణేషన్‌తో నటించింది. ఆ చిత్రం అపజయాన్ని ఎదుర్కొనడం ఆమె ఆర్థికపతనానికి దారితీసింది. ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటూ టీ నగర్ నుండి అణ్ణానగర్‌కు నివాసం మారిన తరువాత ఆమె అంతిమ అంకం ముగిసిపోయింది.**




వసుంధర ఒక సాధారణ గృహిణి. భర్త వ్యాపారవేత్త. అయినా అన్ని ఖర్చులకూ ఆయన్ని అడగడం నచ్చలేదు. ఐదువేల రూపాయలతో వాసవి ప్రింట్స్ ప్రారంభించి బ్లాక్ ప్రింట్ చీరలు అమ్మడం ప్రారంభించారు. అప్పుడే పరిచయమయ్యారు నచికేతానంద పురి స్వామిజీ. ఆయన సూచనపై అంతా మహిళలనే సిబ్బందిగా నియమించారు వసుంధర. వారంతా కూడా ఏ ఆసరాలేని పేద మహిళలు. అప్పటినుంచి వాసవి ప్రింట్స్ మహిళలకు ప్రియమైన నేస్తం అయింది. ఆర్థికంగానూ నిలదొక్కుకుంది. ఇక్కడ పనిచేసే మహిళల స్వావలంబనకు తోడ్పడింది. స్వామిజీ సహాయం లేకుండా ఇదంతా సాధ్యమయ్యేదే కాదంటారు 'వసుంధర మా'. స్వామిజీ యే మొదట ఆమెను మా అని పిలిచారు. అమ్మలానే గౌరవిస్తారు. అప్పటినుంచి అందరికీ ఆమె అమ్మగానే తెలుసు. స్వామిజీ పరిచయం వసుంధర మా ను సమాజసేవకు పురికొల్పింది.

# కలగన్నారు.. నిజం చేశారు!


నచికేతానంద పురి స్వామిజీ


వసుంధర మా

**నచికేత తపోవన్:**

పుట్టింది మహారాష్ట్రలో అయినా చిన్నవయసులోనే ఇంటినుంచి వచ్చేశారు విశ్వదీప్. చదువు ఆపలేదు. బీఎస్సి చదివి పేద పిల్లల కోసం పని చేసేవారు. వివేకానంద కేంద్రంలో వసుంధరని కలిశారు. ఎటువంటి సౌకర్యాలూ కోరుకోకుండా తనకంటూ ఏమీ ఆశించకుండా పేద పిల్లల కోసం విశ్వదీప్ చేస్తున్న కృషి వసుంధరను కదిలించింది. ఆయన సేవకు తానూ తోడయ్యారు. ఆ తర్వాత విశ్వదీప్ సన్యాసదీక్ష తీసుకుని నచికేతానందపురి స్వామిజీ అయ్యారు. అప్పటినుంచి ఆయన చెప్పినట్టు అమ్మ, అమ్మకు సహాయంగా స్వామిజీ ఎన్నో సత్కార్యాలకు శ్రీకారం చుట్టారు. నిరుపేదల పిల్లలకు చదువు చెప్పాలన్న స్వామిజీ ఆలోచనకు వసుంధర, ఆమె స్నేహితులు అండగా నిలిచారు. పేదల కోసం హెల్త్ క్యాంపులు, వారి పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, సమ్మర్ క్యాంప్లు నిర్వహించేవారు. మొదట్లో రోడ్ల పక్కన కొనసాగినా కొన్నాళ్ళకు హైదరాబాద్ కాపూరి హిల్స్లో ఉన్న సొంత స్థలంలో పాక వేసి పేద పిల్లల కోసం నచికేత తపోవన్ పేరిట స్కూల్ ప్రారంభించారు. పుస్తకాలు, పెన్నుల నుంచి యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వరకు పిల్లలకు అన్ని సౌకర్యాలు సమకూర్చేవారు. అలా 60 మంది పిల్లలతో 2001లో ప్రారంభమైన పాఠశాలలో ఇప్పుడు 280 మంది పిల్లలున్నారు. దాతల సహకారంతో అన్ని సౌకర్యాలతో రెండంతస్తుల భవనం నిర్మించారు. ఈ పనులన్నీ స్వామిజీ స్వయంగా చూసుకుంటారు.




మా తన ఆదాయాన్ని, సమయాన్ని ఇతరుల సహాయాన్ని వెచ్చిస్తున్నారు. వీటన్నిటి వెనుకా వసుంధర భర్త సూర్యనారాయణ రెడ్డి సహకారం, తోడ్పాటు ప్రశంసనీయం. చాలా కొద్దికాలంలోనే ఈ పాఠశాల చిత్తశుద్ధి, పిల్లలకు విలువలతో కూడిన విద్య అందించడం చూసి ఎందరో స్వచ్ఛందంగా సేవలందించడానికి ముందుకొచ్చారు. ఇక్కడ చదివే పిల్లల క్రమశిక్షణను మెచ్చుకోవాలి. స్వామిజీ ఏర్పాటు చేసిన నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తారు. వంట చేయడం నుంచి కార్ నడపడం వరకు అన్ని పనులూ నేర్చుకుంటారు. కష్టంగా కాక ఇష్టంగా ఇక్కడ చదువుకున్న పిల్లలు కాలేజీ చదువులు కూడా పూర్తిచేసుకుని చక్కగా స్థిరపడుతున్నారు.

280విద్యార్థులున్న ఈ విద్యావనం ఇప్పటివరకు ప్రభుత్వ సాయం అర్థించలేదు. దాతలే అన్నీ సమకూరుస్తున్నారు. ఏనాడూ ప్రచార ఆర్భాటాలకు కూడా పోలేదు. ఏ ఫీజులూ తీసుకోకుండా పిల్లలకు విద్య అందిస్తుంటే లక్షల్లో పన్ను చెల్లించాలని నోటీసు వచ్చిందని వాపోయారు వసుంధర. కొందరు సహృదయులైన అధికారుల సహాయంతో ఈ సమస్య అధిగమించేలా ప్రయత్నిస్తున్నామన్నారు మా. ఇక్కడితో ఆగిపోలేదు. మరో మహత్కార్యానికి పూనుకున్నారు స్వామిజీ. ఆయన ఆశయాన్ని సుసాధ్యం చేశారు వసుంధర మా బృందం. ఆ విశేషాలు మరోసారి తెలుసుకుందాం.

**నచికేత తపోవన్ ఫోన్ నంబర్స్:-**
**99890 64499, 80088 82828**

**-కె. శోభ**




## 3.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లాలో ఈ ఏడాది మూడులక్షల 30వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్ తెలిపారు. నిమ్మాడ, రావిపాడులలో పౌరసరఫరాల సిఎంఆర్ డెలివరీ పాయింట్ గోదాముని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 24 పౌరసరఫరాల గోదాములు ఉన్నాయని, మిల్లుల నుండి తయారైన బియ్యాన్ని సేకరించి సిఎంఆర్ పాయింట్ల ద్వారా గోదాములలో నిల్వ చేయడం జరుగుతుందన్నారు. ముందుగా జిల్లాలోనే నిమ్మాడ నుంచి బియ్యం సేకరణ ప్రారంభిస్తున్నామన్నారు. మిల్లర్లంతా లక్ష్యాలు చేరుకోవడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, జిల్లా పౌర సరఫరా అధికారి జి.సూర్యప్రకాష్ రావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.వేణుగోపాల్, సహాయ మేనేజర్ శ్రీనివాసరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కె.హరి వరప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, కోరాడ గోవిందరావులు పాల్గొన్నారు.



## నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు జరపాలి

**(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)**

మండలంలోని పురుషోత్తపురం వద్ద వంశధార నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ప్రభుత్వం నిబంధన ప్రకారం జరపాలని జిల్లా కలెక్టర్ అన్నారు శుక్రవారం పురుషోత్తపురంలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు హాజరైన సందర్భంగా ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకతవ్వకాలు కూలీలతో తవ్వించాలన్నారు. వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నదిలో తవ్వకాలు చేస్తున్న ప్రాంతాలను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తవ్వకాలు చేస్తున్న నదీ ప్రాంతాన్ని సీసీ కెమెరాలో కనిపించేటట్లు ఉంచాలన్నారు. రోజువారి వెళ్లి వచ్చే వాహనాలపై ఆరా తీశారు అలాగే అక్కడ ఉన్న లారీ డ్రైవర్లతో మాట్లాడి తవ్వకాల గురించి అడిగి తెలుసుకున్నారు.



## విద్యార్థి మృతిపై సత్వర నివేదిక అందించండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి గురువారం అర్ధరాత్రి ఉరి పోసుకొని మరణించడంపై జిల్లా అధికారులు సత్వర నివేదిక అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని, పరీక్షల ఒత్తిడి ఏమైనా ఉందా, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పరిశీలన జరిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్కు ఆయా వివరాలు పంపాలని సూచించినట్లు తెలిపారు. నివేదికను అనుసరించి తదుపరి చర్యలకు వివిధ సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

## గీత కార్మికులను ఆదుకోండి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ప్రకృతి సహజ సిద్ధమైన సంపద (ఈత, తాటి చెట్ల)పై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికుల ప్రయోజనాలను తగువిధంగా కాపాడవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉందని అఖిల బారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి గుర్తు చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పురాణగ్రంధాల్లో పేర్కొన్నట్లు దేవేంద్రుడు ఆకాశమార్గంలో అమృతం తీసుకుని వెళ్తున్నప్పుడు ఆ పాత్ర చిట్లి, నేల రాలిన రెండు అమృత బిందువులు భూమిపై ఈత, తాటి చెట్లుగా ఆవిర్భవించాయన్నారు. ఇటువంటి చెట్ల నుంచి వచ్చే ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్న గీత కార్మికులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాలను కోరారు. జిల్లాలో 38 మండలాల్లో సుమారు 2లక్షలకు పైగా శ్రీశయన కులస్తున్నారని, వారిని ఎస్టీల్లో చేర్చే విధంగా చూడాలన్నారు.



# బలవంతపు భూసేకరణ ఆపాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్పోర్ట్ కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని వారు హెచ్చరించారు. జిల్లాలో పైడిభీమవరం నుండి ఇచ్చాపురం వరకు 193 కిలోమీటర్లు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నారని వారు ఆరోపించారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్ కోస్ట్ పవర్ ప్లాంట్ కు ప్రభుత్వము 2020 ఎకరాలు భూమిని ఇస్తే ఈస్ట్కోస్ట్ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాలా పిటిషన్ వేస్తే ప్రభుత్వం ఆక్షన్ వేసి సమీర్పేట్ లాజిస్టిక్ కంపెనీకు రూ.26కోట్లకు కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని వారు విమర్శించారు. దీనివలన ప్రజల జీవన విధానము ధ్వంసం అయిపోతుందన్నారు. జిల్లా సస్యశ్యామలంగా అభివృద్ధి జరగాలంటే వంశధార ప్రాజెక్ట్ నిర్మించి 50 సంవత్సరాలు కావస్తున్నదని, వంశధార ఆధునికరణకు రూ.1000కోట్లు కేటాయించి చివర భూముల వరకు నీరు అందిస్తే రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు. తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెరుగుతాయని, ఉపాధి దొరుకుతుందని, వలసల నివారించబడతాయన్నారు. జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. వంశధార ఆధునీకరణకు ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అభివృద్ధా! ప్రజల అభివృద్ధా? అని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పాలరైతులకు లీటరుకు రూ.మూడు నుంచి ఐదు రూపాయల వరకు ధర తగ్గించి రైతులను తీవ్రంగా దోపిడీ చేస్తుందని విమర్శించారు. తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. జీడి, కొబ్బరికి రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కార్యదర్శివర్గం డిమాండ్ చేసిందని వారు అన్నారు.



# ఇసుక లభ్యత పెంచాలి

## - ధర పెరగకుండా చూడాలి
## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



విశాఖ, విజయనగరం జిల్లాలు ఇసుక కోసం శ్రీకాకుళం జిల్లా పైనే అధిక శాతం ఆధారపడి ఉన్నందున జిల్లా నుంచి ఇసుక లభ్యతను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యత, ధరలు, అక్రమ రవాణా, ఇతర ఫిర్యాదులపై ఆయన కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్తో కలసి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ట్రాన్స్ఫార్మర్లు, రీచ్ నిర్వాహకులు, బిల్డర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రవాణా, తవ్వకం, వ్యయ భారం వినియోగదారులపై ఎక్కువగా పడకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఇసుక ధరలపై తరచుగా సమీక్షించాలని ఇసుక సమస్యలపై టోల్ఫ్రీ 18004256012, వాట్సాప్ నెంబర్ 9701691657ను సంప్రదించడం ద్వారా వివరాలు అడిగి తెలుసుకోవచ్చన్నారు. ఇసుక సరఫరా, ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రజల నుంచి మరిన్ని వివరాలు తెలుసుకునేలా వ్యవస్థ పని చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణా చేస్తున్న 11లారీలను ఇటీవల సీజ్ చేశామన్నారు. నిబంధనలు పాటించకపోతే మరిన్ని కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు పాటించని రీచ్ల నిర్వహణ సంస్థల్ని బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ఇసుక రవాణాకు బిల్లులు జారీ చేసే విధానం, నకిలీ బిల్లులను గుర్తించే విధంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఆయా రీచ్లకు కేటాయించిన సిబ్బంది తప్పక అందుబాటులో ఉండాలని, స్థానికుల నుంచి ఇబ్బందులు, ఫిర్యాదులను పరగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఇసుక లభ్యత ఎక్కువగా ఉంటే ధర తగ్గుతుందని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఎడ్లబళ్లపై ఇసుక తీసుకువెళ్ళే వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని, రాత్రివేళల్లో అక్రమ తవ్వకాలు జరగకుండా నిఘా పెంచాలని, రాత్రి వేళ రవాణాకు ఎలాంటి ఇబ్బంది లేదని ఆదేశించారు. అన్ని రీచ్లలో లైట్లు, కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను, క్షేత్రస్థాయిలో సమస్యలను అడిగారు. సమావేశంలో ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష, మైన్స్ డిడి మోహనరావు, డీఎస్పీ వివేకానంద, పలువురు సిఐ లు, సంబంధిత రీచ్ ల పరిధిలోని తహశీల్దార్లు, క్రెడాయి ప్రతినిధులు, రీచ్ నిర్వాహకులు పాల్గొన్నారు.















# ‘ఆర్మీ కాలింగ్’ హింసపై లోకేష్ తీవ్ర స్పందన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ ఆర్మీ కాలింగ్ అనే సంస్థను ఏర్పాటుచేసి, ఇక్కడ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను యూఎస్‌బీ కేబుల్‌తో చితక బాదుతూ బండబూతులు తిడుతున్న సంస్థ నిర్వాహకుడు బీవీ రమణ వీడియో హల్‌చల్ కావడంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా దీనిపై అన్ని పత్రికలు, టీవీ ఛానళ్లు, యూ–ట్యూబ్ ఛానళ్లు కథనాలు ప్రచురించాయి. అంతకు ముందే విజయనగరానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త సొంగ మనోజ్‌కుమార్ ఈ వీడియోను రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ‘ఎక్స్’లో ట్వీట్ చేశారు. అదే సమయంలో శుక్రవారం సాయంత్రం అన్ని మీడియాల్లోనూ ఈ కథనం రావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. బీవీ రమణ కోసం గాలించారు. మరోవైపు టీడీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు శుక్రవారం సాయంత్రం ‘సత్యం’ ప్రతినిధికి ఫోన్ చేసి వాస్తవాలు ఏమేరకు ఉన్నాయని ఆరా తీశారు. విద్యార్థులు, సంస్థ రికగ్నైజేషన్, నిర్వాహకుడి వ్యవహార శైలి వంటి విషయాలు కూలంకుషంగా అడిగి తెలుసుకున్నారు. ‘సత్యం’లో వచ్చిన కథనం చదివామని, తెర వెనుక వాస్తవాలేమిటని ఆరా తీశారు. మంత్రి నారా లోకేష్ దీనిపై స్పందించడం కోసం వివరాలు అడుగుతున్నామని పేర్కొన్నారు. వెంటనే కారణాలేమైనా కానీ ఇటువంటి ప్రవృత్తి కలిగిన సంస్థ నిర్వాహకుడిపై జిల్లా పోలీసులు చర్యలు తీసుకోవాలని లోకేష్ ‘ఎక్స్’ వేదికగా శ్రీకాకుళం పోలీసు, రాష్ట్ర పోలీస్ శాఖలకు టాగ్ చేస్తూ ఒక ట్వీట్ వేశారు. దీంతో పోలీస్ బాస్ ఈ వ్యవహారాన్ని టౌన్ డీఎస్పీ వివేకానందకు అప్పగించి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వాహకులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బీవీ రమణను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు భోగట్టా. బీవీ రమణకు జిల్లాలో ఉన్న కొందరితో లింకులపై ఆరా తీస్తుండగా,




ఆయన కళ్లుతిరిగి పడిపోయాడని తెలుస్తుంది. ఆసుపత్రిలో శనివారం చికిత్స చేయించి వైద్యుల సిఫార్సు మేరకు మీడియా ముందు బీవీ రమణను ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తుంది. బీవీ రమణపై ఇంకా అనేక ఆరోపణలు ఉన్నాయి. అయితే వీటి సాక్ష్యాలన్నీ ఆయన హాస్టల్ కాంపౌండ్‌లోనే ఉన్నాయి. కాబట్టి ఇన్నాళ్లూ పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోలేకపోయారు. ఇప్పుడు ఒక్క లోకేష్ ట్వీట్‌తో మొత్తం యంత్రాంగం కదిలింది. త్వరలోనే అన్ని విషయాలూ పోలీసులే వెల్లడిస్తారని తెలుస్తుంది.

# మధుర స్మృతిలా ఆత్మీయ సమావేశం

## - రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు -





(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

పండుగ వాతావరణంలో ఆత్మీయ సమావేశంలా, మధుర స్మృతిలా నిలిచిపోయేలా పేరెంట్స్ మీటింగును ఏర్పాటు చేశారని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శనివారం కోటబొమ్మాళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి సరస్వతి దేవి విగ్రహానికి, జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. తొలుత విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించిన మంత్రి భవిష్యత్తులో ఏమవ్వాలని అనుకుంటున్నారో విద్యార్థులను అడిగి తెలుకొని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు నృత్య ప్రదర్శలను అలరించగా, సైబర్ క్రైమ్ పై కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ మహిళా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల నివారణపై తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. పేరెంట్స్ కమిటి సమావేశాల్లో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నారా, లేదా, అలాగే వారి ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పిల్లల ఆశయాలను అమలులోకి తేవాలంటే తల్లిదండ్రులు భాగస్వామ్యం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నవారికి మంత్రి, కలెక్టర్ బహుమతులను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, పాఠశాల ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సకలాభక్తుల విశ్వనాథం పాఠశాలకు, తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరాజు స్కూల్ ప్రగతి నివేదిక వివరించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, మండల ప్రత్యేక అధికారిణి గడేమ్మ, వైశ్య సంఘ రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, కళ్లి నాగయ్య రెడ్డి, లక్ష్మణ రెడ్డి, కింజరాపు హరిప్రసాద్, వెలమల కామేశ్వరరావు, బోయిన రమేష్, బోయిన గోవిందరాజులు, ఎస్ఎంసీ చైర్మన్ బోయిన వెంకటరమణ, మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావు అధ్యక్షతన మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పల్లా జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, భాగస్వామ్యంతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచవచ్చని అన్నారు. పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తనా పరంగా ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకొని అర్థం చేసుకోవడానికి ఇటువంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల విద్యాభివృద్ధికి పేరెంట్స్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలిసికట్టుగా కృషి చేస్తామని ‘ప్రతిజ్ఞ’ చేయించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హాజరై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మున్సిపల్ కార్పొరేషన్ శివశంకర్ క్రమశిక్షణతో కూడిన చదువులు నేర్చుకోవాలని, సమాజ అభ్యున్నతికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. టూ టౌన్ ఏఎస్సై శంకర్రావు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం –అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. వార్డు ఇన్‌ఛార్జి బలగ శివప్రసాద్ దేవ్, పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ బాన్న సంజీవరావు, మౌళి మాట్లాడుతూ ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, పెద్దలను ప్రతి విద్యార్థి గౌరవించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు పాఠశాల ప్రగతి నివేదికను వివరించారు. ప్రస్తుతం దేశాన్ని కుదిపివేస్తున్న ‘డ్రగ్స్ వినియోగం – అనర్థాలు’ అనే అంశంపై వివరణాత్మకంగా సీనియర్ విద్యార్థిని లాస్య వివరించారు. విలేజ్ మహిళా పోలీస్ సైబర్ నేరాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా హాజరైన విద్యార్థుల తల్లులు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. తండ్రులు టగ్ ఆఫ్ వార్ ఆటలో పాల్గొన్నారు. గెలిచిన తల్లిదండ్రులకు బహుమతులను పేరెంట్స్ కమిటీ చైర్మన్, అతిథుల చేతుల మీదుగా అందజేశారు. తల్లిదండ్రులు, అతిథులు, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సదాశివుని శంకరరావు, ఏ.చిన్నవాడు, కె.వి.రమణ, పి.రమణకుమారి, టి.శ్రీపూర్ణిమ, పైడి భాగ్యలక్ష్మి, కె.చంద్రకళ, ఈ.గౌరి, సిహెచ్.విజయశ్రీ, సిహెచ్ రమణమ్మ, సుప్రియ, లక్ష్మి, రాజేష్, విద్యార్థులు లాస్య, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, మెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

# పాపం ఎవరిదైనా..
# భారం మనదే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు అనేక సభల్లో హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలకు అదనంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కొత్త వడ్డనకు తెరతీశారు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే ఇంధన ధరలు, కొనుగోలు చేసే విద్యుత్ ధరల వ్యత్యాసాన్ని లెక్కించి ఆ లోటును భర్తీ చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ధరలు పెరుగుదలపై ‘ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి’ కార్యక్రమం చేపట్టి చంద్రబాబు అందరి దృష్టి ఆకర్షించారు. ఇప్పుడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో ఒక యూనిట్ విద్యుత్‌కు రూ.6.50 ఖర్చవుతుందని, ఆ ప్రతిపాదనల మేరకు ఒక్కో యూనిట్‌కూ ప్రతి నెలా విద్యుత్ కొనుగోలు సర్దుబాటు ఛార్జీలుగా 40 పైసల చొప్పున విధించేందుకు ఏపీఈఆర్సీ నిర్ణయించింది. ఈ మేరకు గత నెలలో వినియోగించిన విద్యుత్‌కు ఈ నెల వచ్చే బిల్లులో కలిపి బిల్లు ఇస్తున్నారు.

### యూనిట్‌కు 80 పైసలు

అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయం సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే 2014–19లో వినియోగించిన విద్యుత్‌పై ట్రూ అప్ ఛార్జీ పేరుతో ఎఫ్‌పీపీసీఏ–1పేరుతో బిల్లులపై 40 పైసలు సర్దుబాటు ఛార్జీ వసూలు చేస్తున్నారు. ట్రూ అప్ ఛార్జీల కింద గతంలో వినియోగించిన కరెంటుకు యూనిట్‌కు గరిష్టంగా 80 పైసల వరకు వసూలు చేయడానికి రంగం సిద్ధమైందని వామపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. తాజాగా ఈ నెల కరెంటు బిల్లులో ట్రూ అప్ ఛార్జీలు కలిపి రాబడుతున్నారు. వినియోగదారుడు ఏడాది కాలంలో వినియోగించిన మొత్తం యూనిట్లను సరాసరి చేసి ప్రతి నెలా వసూలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఈ నెల నుంచే అమలుచేయడం ప్రారంభించారు. విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ–1 పేరుతో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని నవంబర్ నుంచి 2026 జనవరి వరకు ఉన్న కాలాన్ని నాలుగు క్వార్టర్లుగా విభజించారు. ఈ ఏడాది నవంబర్ వాడిన యూనిట్‌కు 80 పైసలు చొప్పున డిసెంబర్ బిల్లులో కలిపి ఇస్తున్నారు.

### జిల్లాకు రూ.67 కోట్లు భారం

ఇప్పటికే వినియోగదారుల నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌కు ఎఫ్‌పీపీసీఏ–1 పేరుతో 40 పైసలు వసూలు చేస్తోంది. దీనికి అదనంగా 2026 ఫిబ్రవరి వరకు విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేయనున్నారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్ ఛార్జీల పేరుతో చేస్తున్న వసూలుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. గతంలో వినియోగించిన ఇంధన, విద్యుత్ కొనుగోలు, వ్యయం సర్దుబాటు ఛార్జీల పేరుతో రాబోయే నాలుగేళ్ల పాటు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని డిస్కంలు చెబుతున్నాయి. ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ కావాలంటే అందుకు తగ్గట్టు యూనిట్ ధరలు పెరగాలని చెబుతుంది. విద్యుత్ ఉత్పాదన వ్యయం, కొనుగోలు ధరల వ్యత్యాసాన్ని గతంలో ట్రూ అప్ పేరుతో ఏడాదికి ఒకసారి లెక్కించి వసూలు చేసేవారు. కొత్త నిబంధన ప్రకారం ఇకపై ఏ నెలకు ఆ నెల విద్యుత్ బిల్లుతో కలిపి వసూలు చేస్తున్నారు. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 7,87,601 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారుల నుంచి ప్రతి నెల రూ. 106 కోట్లు విద్యుత్ సంస్థలకు ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో నెలకు సుమారు రూ.6 కోట్లు ఆదాయం సమకూరనుంది. ఈ లెక్కన ఏడాదికి దాదాపు రూ. 67 కోట్లు వినియోగదారులపై భారం పడనుంది. ఫిక్సిడ్, కస్టమర్, ఈడీ ఛార్జీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న డిస్కంలు ఎఫ్‌పీపీసీఏ పేరుతో ఛార్జీలు వేయడాన్ని సామాన్యులు ఆక్షేపిస్తున్నారు.

# సరిగ్గా రెండేళ్లు..
# అదే రోజు.. అదే ప్రాంతం



- భూ వివాదంలో ఒకరి హత్య
- భూమి కోసమే గతంలో రామశేషు బలి
- శ్రీకూర్మంలో భూమి విలువలే కారణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకూర్మం సర్పంచ్ రామశేషు హత్య జరిగి డిసెంబర్ 6కి సరిగ్గా రెండేళ్లు. భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఈ హత్య రాష్ట్రంలోనే సంచలనం రేపింది. ఇప్పుడూ అటువంటి హత్యే అదే గ్రామంలో అదే రోజు జరిగింది. రామశేషు మృతిచెంది రెండేళ్లు పూర్తయిన రోజునే ప్రత్యర్థులు దారి కాచి మారణాయుధాలతో ముగ్గురిపై దాడి చేశారు. దాడిలో రెడ్డికవీధికి చెందిన ఉప్పాడ రాజేష్ (38) అలియాస్ ఉల్లిపాయల రాజేష్ ఇక్కడక్కడే మృతి చెందగా చుక్కా రాము, అతని భార్య సరోజిని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరారు. ఈ దాడిలో 11మందిని అనుమానితులుగా గుర్తించిన పోలీసులు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకూర్మం పంచాయతీ పరిధిలోని చింతవలసలోని 1.40 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం కారణంగా దాడి జరిగినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి వివాదంపై 2018లో క్రైం రిజిస్టర్ అయినట్టు తెలిసింది. మృతుడు రాజేష్ సమీప బంధువు ఉప్పాడ రాములమ్మకు వారసత్వంగా వచ్చిన ఈ భూమిని దక్కించుకోవడానికి గ్రామానికి చెందిన కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాములమ్మ శ్రీకూర్మం నుంచి బలివాడకు మకాం మార్చుకుంది. ఈ భూమి తమదేనని కొయ్య భాస్కరరావు కుటుంబసభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఉప్పాడ రాములమ్మకు అనుకూలంగా డిక్రీ ఇచ్చింది. దీంతో కింద కోర్టు తీర్పును హైకోర్టులో కొయ్య భాస్కరరావు వర్గీయులు అప్పీలు చేశారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ దిగువ కోర్టు తీర్పును అమలుచేయాలని తీర్పు వెలువరించింది. దీంతో కొయ్య భాస్కరరావు వర్గీయులు ఉప్పాడ రాములమ్మ నుంచి ఆ భూమిని సొంతం చేసుకోవాలని నిరంతరం ప్రయత్నాలు చేస్తునే వచ్చారు. రాములమ్మకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పు ఇచ్చినా కొయ్య భాస్కరరావు వర్గీయులకు వ్యతిరేకంగా ఈ భూమిని ఎవరూ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు.

రాములమ్మ తన సమీప బంధువు శ్రీకూర్మంకు చెందిన ఉప్పాడ సూర్యనారాయణతో పాటు చుక్క రాము, అనపాన షన్ముఖరావుకు 1.40 ఎకరాల భూమిని ఈ ఏడాది మార్చిలో రిజిస్ట్రేషన్ చేసింది. ఈ ముగ్గురు కలిసి ఆ భూమిని రాములమ్మ నుంచి కొనుగోలు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ వ్యవహారం రుచించని కొయ్య భాస్కరరావు వర్గీయులు శుక్రవారం సాయంత్రం ముందుగా భూమి కొనుగోలు చేసినవారిలో ఒకరైన ఉప్పాడ సూర్యనారాయణపై దాడి చేయడానికి సమాయత్తమయ్యారు. విషయాన్ని తెలుసుకున్న సూర్యనారాయణ వారి నుంచి తప్పించుకున్నాడు. కొయ్య భాస్కరరావు వర్గీయులు దాడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని సూర్యనారాయణ సమీప బంధువు రాజేష్‌కు చెప్పినట్టు తెలిసింది. అయితే రాజేష్ తనపై దాడి చేయాల్సిన అవసరం కొయ్య భాస్కరరావు వర్గీయులకు ఏముందని సూర్యనారాయణతో అన్నట్టు తెలిసింది. ఈలోగా రాజేష్, చుక్కా రాము, అతని భార్య సరోజినిలపై కర్రలు, మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు.





రాజేష్ ఘటనా స్థలం వద్దనే మృతిచెందాడు. వాస్తవంగా భూవివాదంతో రాజేష్‌కు ఎటువంటి సంబంధం లేదని స్థానికులు చెబుతున్నారు. అయితే రాజేష్ అండదండలతోనే ఆ భూమిని కొనుగోలు చేశారని కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యులు భావించి దాడి చేసినట్టు తెలిసింది. రాములమ్మకు లీగల్ వ్యవహారంలో అన్నివిధాల సహకరించడం వల్ల రాజేష్‌పై కక్ష పెంచుకున్నట్టు గ్రామంలో చర్చ సాగుతుంది.

### పేకాట నిర్వాహకులతో సంబంధం

జిల్లా సరిహద్దులో ఉన్న ఒడిశా పరిధి గారబందలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న ఆమదాలవలస తోటాడకు చెందిన బెండి తులసీ, అక్కివరానికి చెందిన మాజీ ఆర్మీఉద్యోగి తాంద్ర తేజేశ్వరరావు, శ్రీకాకుళం నగరానికి చెందిన గోపీకృష్ణ(గోపి)తో రాజేష్‌కు ఇప్పటికీ సత్సంబంధాలు ఉన్నాయి. ఈ ముగ్గురితో పాటు రాజేష్‌కు పేకాట శిబిరాల్లో వాటాలున్నాయి. తులసీ, తేజా, గోపితో పాటు ఈ పేకాట శిబిరం నిర్వహించడానికి రాజేష్ 20 పైసలు వాటా పెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. శ్రీకూర్మం ప్రాంతంలో తరచూ పేకాట, పిక్కాట నిర్వహించే రాజేష్‌కు స్థానిక పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడంతో ఆపేయాల్సి వచ్చింది. దీంతో బెండి తులసీ, తాంద్ర తేజా, గోపీతో జతకట్టడం ప్రారంభించాడు. వారితో కలిసి ఒడిశా బాటపట్టాడు. శుక్రవారం పేకాట శిబిరానికి తులసీ, తేజతో కలిసి వెళ్లివుంటే దాడి నుంచి రాజేష్ తప్పించుకునేవాడని వారే చెబుతున్నారట. ప్రతి రోజు ఉదయం శ్రీకాకుళం పెద్దమార్కెట్‌లో ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ మధ్యాహ్నం పేకాట శిబిరాలు, జాతర్లలో పిక్కాట నిర్వహిస్తుంటాడు. వేసవి కాలంలో కొన్నాళ్లు పెద్దపాడు ఫ్లైవోవర్ వద్ద చెరుకు రసం విక్రయించాడు. భూవ్యవహారంతో సంబంధం లేకపోయినా రాజేష్ హతం కావడంతో గ్రామంలో సర్వత్రా చర్చ ప్రారంభమైంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.